క్లుప్తంగా

కుర్చీల వితరణ



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని నల్లగొండ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన లెక్కల వెంకటరమణారెడ్డి రూ.6 వేలు విలువ చేసే కుర్చీలను గురువారం వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తామని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు కందుల మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

వరికుంటపాడు: మండలంలోని నారసింహాపురంలో మంచినీటి పథకం మోటార్లు మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్య నెలకొంది. దీంతో సమస్య పరిష్కారానికి ప్రముఖ పారిశ్రామికవేత్త యర్రా బ్రహ్మయ్య వాటర్ ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాలినేనికి పరామర్శ



సీతారామపురం: మండలంలోని పోలంగారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బాలినేని మాబయ్యను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల బాలినేని తండ్రి చెంచయ్య మృతి చెందగా ఉత్తరక్రియలను గురువారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై చెంచయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం బాలినేని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, వైస్‌ఎంపీపీ కృష్ణారెడ్డి, సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు, తిరుమలరెడ్డి, గండిపాళెం మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య, రేనాటి సుధాకర్‌నాయుడు, పాలకొలను వెంకటరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు గాజులపల్లి రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో డిప్యూటీ ఈఓ తనిఖీలు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ గోపాల్

మర్రిపాడు: మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలను ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ గురువారం తనిఖీ చేశారు. తొలుత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యాబోధనపై విద్యార్థులను ఆరా తీశారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందజేశారు. బాలికల వసతిగృహాన్ని పరిశీలించి ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, వార్డెన్‌కు సూచనలు చేశారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల పనితీరును అభినందించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ–2 ధనలక్ష్మితో సమావేశమై మండలంలో విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్షించారు.

న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజకులు

సీతారామపురం: రజక మాన్యపు భూములకు సంబంధించి తమకు న్యాయం చేయాలని మారంరెడ్డిపల్లికి చెందిన రజకులు తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డిని కోరారు. గురువారం వారు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి రజక మాన్యం సమస్యను విన్నవించారు. మారంరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 190–2లో ఉన్న 6.32 ఎకరాల రజక మాన్యం భూమిని గతంలో గంధంవారిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించడం జరిగిందన్నారు. ఇప్పుడు స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు రజక మాన్యం తమదంటూ అడ్డుతగలడం విచారకరమన్నారు. అనంతరం రజక మాన్యానికి సంబంధించి పలు ఆధారాలను తహసీల్దార్‌కు అందజేసి అడ్డుతగులుతున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. అందుకు స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారించి అర్హులైన వారికి న్యాయం చేస్తామన్నారు.

లంచాల మత్తు.. ఊరూరా కంపు

- చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలింపు
- స్వాగతం చెబుతున్న చెక్‌పోస్టులు
- నియంత్రణలో శాఖల మధ్యన సమన్వయలోపం



పోలీసులు పట్టుకున్న కోళ్ల వ్యర్థాల లారీలు(ఫైల్)

సంగం: మంచినీటి చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు. పక్కరాష్ట్రాల నుంచి నిత్యం టన్నుల కొద్దీ కోళ్ల మాంసం వ్యర్థాలను జిల్లాకు తరలిస్తున్నారు. అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి తెచ్చి చేపల గుంతల్లో వేస్తున్నారు. వాటిని తినడం వల్ల జీర్ణకోశ సంబంధిత కేన్సర్లు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. చేపలకు మాంసం వ్యర్థాలను ఆహారంగా వేయడాన్ని కేంద్రం నిషేధించింది. అయినప్పటికీ వాటి రవాణా, వినియోగాన్ని నియంత్రించాల్సిన మత్స్య, పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులు మామూళ్ల మత్తులో నిద్రపోతున్నారు.

జోరుగా నిషేధిత క్యాట్‌ఫిష్ సాగు

జిల్లాలో అధికారికంగా దాదాపు 11,485 ఎకరాలకుపైగా మంచినీటి చేపలను సాగు చేస్తున్నారు . అనధికారికంగా మరో 17 వేల ఎకరాల్లో గుట్టుచప్పుడు కాకుండా మంచినీటి చేపలతో పాటు నిషేధిత క్యాట్ ఫిష్ సాగుచేపడుతున్నట్లు సమాచారం. వాతావరణ కాలుష్యానికి, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగిస్తున్న క్యాట్‌షిఫ్‌ల సాగుపై నిషేధం అమల్లో ఉంది. అయినప్పటికీ వాటి పెంపకం కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో జోరుగా సాగుతోంది. క్యాట్‌ఫిష్‌లకు ఆహారంగా వేస్తున్న చికెన్ వ్యర్థాలను ప్రస్తుతం మంచినీటి చేపలకు వినియోగిస్తున్నారు. చేపల ఫీడ్ భారీగా పెరిగిపోవడంతో చౌకగా దొరికే మాంసం వ్యర్థాలను కొందరు రైతులు వారి స్వార్థం కోసం వినియోగిస్తున్నారు.

కేంద్రం నిషేధించినా..

కోళ్ల వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేయడాన్ని నిషేధిస్తూ కేంద్రం ఏడాది క్రితం అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు ధిక్కరించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. కేంద్రం ఆదేశాలతో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక కోళ్ల వ్యర్థాలను నిషేధించగా, ఆ వ్యర్థాలను మన జిల్లాకు నిత్యం టన్నుల కొద్దీ డంప్ చేస్తున్నారు.



దువ్వూరులో చేపల గుంతపై తేలియాడుతున్న చికెన్ వ్యర్థాలు

లంచాల మత్తులో మత్స్యశాఖ

జిల్లాలో జరిగే చేపల పెంపకంపై దృష్టి సారించాల్సిన మత్స్యశాఖ అధికారులు రైతులతో కుమ్మక్కై వారు ఇచ్చే నెలసరి మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిషేధిత క్యాట్‌ఫిష్ పెంపకం చేపడుతున్నా, వాటితో పాటు మంచినీటి చేపలకు చికెన్ వ్యర్థాలను వినియోగిస్తున్నా నిద్రపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. గత రెండు నెలలుగా చికెన్ వ్యర్థాలను తరచూ పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయినా చేపల గుంతల యజమానులపై మత్స్యశాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు యథేచ్ఛగా చికెన్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు. ఇటీవల సంగం, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో చికెన్ వ్యర్థాలను పట్టుకున్న పోలీసులు పంచనామా నిమిత్తం మత్స్యశాఖకు సమాచారం అందజేశారు. అయినా ఆ శాఖ అధికారులు ఎలాంటి కేసులు నమోదు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చికెన్ వ్యర్థాలను ఆహారంగా తీసుకునే చేపలను తిన్నవారికి జీర్ణకోశ సంబంధిత కేన్సర్లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. అయినా అధికారులు వాటిని నిరోధించలేని స్థితిలో ఉండడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

స్వాగతం చెబుతున్న చెక్‌పోస్టులు

కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో చేపల గుంతలు సాగులో ఉన్నాయి. అధికారిక లెక్కలు చెప్పేందుకు సైతం అధికారులు భయపడుతున్నారు. రైతులు చేపలకు దాణా కన్నా తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే చికెన్ వ్యర్థాలను ఆహారంగా వినియోగిస్తున్నారు. జిల్లాలో లభ్యమయ్యే వ్యర్థాలు సరిపోకపోవంతో సరఫరా కోసం మాఫియా ఏర్పడింది. బెంగుళూరు, చెన్నై, తదితర ప్రాంతాల నుంచి వ్యర్థాలను సేకరించి ప్రత్యేక వాహనాల్లో చేపల గుంతల వద్దకు తరలిస్తున్నారు. ఈ వాహనాలు వెళ్లే సమయంలో దుర్గంధం వెదజల్లుతున్నా ఎక్కడా అధికారులు అడ్డుకోవడం లేదు. మాఫియా ఇచ్చే డబ్బులతో చెక్‌పోస్టుల వద్ద స్వాగతం పలుకుతున్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే చికెన్ వ్యర్థాల రవాణాపై జిల్లా కలెక్టర్ ఆనంద్ రాజకీయాలకు అతీతంగా స్పందించి విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకున్నాం



నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై నిత్యం ప్రత్యేక వాహనాల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. ఈ వాహనాలు వెళ్లే సమయంలో వెలువడే దుర్గంధంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేపల గుంతల నుంచి వెలువడే దుర్గంధంతో పరిసర ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. –వెంకటేశ్వర్లు, దువ్వూరు

రైతులకు నోటీసులు జారీ చేశాం

చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలను ఎక్కువగా కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో వినియోగిస్తున్నట్లు గుర్తించాం. పోలీసు, రవాణా శాఖ అధికారుల సమన్వయంతో చికెన్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే కొంత మంది రైతులకు హెచ్చరిక నోటీసులు జారీ చేశాం. –నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు



ఉదయగిరిలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



సీతారామపురంలో ..

ఉదయగిరి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు గురువారం తీర్పునిచ్చిన నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ 1994 జూలై 7న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని మంద కృష్ణ మాదిగ ప్రారంభించారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడం సంతోషదాయకమన్నారు. ఈ నిర్ణయంతో మాదిగలతో పాటు మాదిగ ఉపకులాలు, మాలలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బకీరు జాషువా, బెజవాడ బాలగురవయ్య, ఇత్తడి రమణయ్య, అశోక్, పెంచలయ్య పాల్గొన్నారు.

సీతారామపురం: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై సీతారామపురం బస్టాండ్ సెంటర్‌లో దళిత నాయకులు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, దళిత నాయకులు కలివెల ఎలీషాకుమార్, నేలటూరు జాషువా, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ కిరణ్, రమణయ్య, తిరుపాలు, అబ్రహం, జయపాల్, ఓబులేసు, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

ఆత్మకూరు: భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఆత్మకూరుకు చెందిన ఎస్సీ,ఎస్టీ ప్రొటెక్ట్ కౌన్సిల్ జిలా అధ్యక్షుడు శేషం సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నూరు తరాల భవిష్యత్‌ను నిర్దేశించనుందన్నారు. విద్య, ఉద్యోగాల్లో వర్గీకరణ అవసరమని, సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో వెనుకబడిన కులాలకు మంచి జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నేటి నుంచి గంధ మహోత్సవం

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరీ ఔలియా దర్గాలో శుక్రవారం నుంచి గంధ మహోత్సవాన్ని అత్యంతం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌దార్ మన్సూర్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్ తెలిపారు. దర్గా ఆవరణలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గంధ మహోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంధ మహోత్సవానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి కృష్ణారెడ్డి హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సికిందర్, ఖాదర్‌బాషా, లియాఖత్, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ఆత్మకూరు: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ఆత్మకూరులో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరాపై సమీక్షించనున్నట్లు చెప్పారు. అనంతరం తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, నూతన తహసీల్దార్ కార్యాలయం, బీసీ బాలికల వసతి గృహ నిర్మాణ పనులపై ఆర్డీఓతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలి



డీటీకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని గిరిజనులకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గిరీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్‌బాషా మాట్లాడుతూ అనంతసాగరంలోని గిరిజన కాలనీలో సుమారు 80 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని తెలిపారు. గిరిజనులకు ఎన్నో ఏళ్లుగా శ్మశాన స్థలం లేదన్నారు. కాలనీలో ఎవరైనా మరణిస్తే సమీపంలోని అటవీ ప్రాంతంలో ఖననం చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అక్కడ మృతదేహాలను ఖననం చేయొద్దని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారన్నారు. శ్మశానంతో పాటు కాలనీలో తాగునీరు, విద్యుత్, సిమెంట్ రోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. సీపీఎం నాయకులు మంగళ పుల్లయ్య, ఉప్పలపాడు మస్తాన్, నాగులేటి వెంకటేష్, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



సీతారామపురం హైస్కూల్‌లో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు ఉదయగిరి, వింజమూరు ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలి, మధుసూదన్ రెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి తరగతుల వారీగా ఓటర్ల జాబితాను పాఠశాలల్లో ప్రదర్శిస్తామన్నారు. 5వతేదీలోపు ఓటరు జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి నోటీసు బోర్డులో తుది ఓటరు జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. 8న మేనేజ్‌మెంట్ కమిటీ ఎంపిక, చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక, ప్రమాణ స్వీకారం ఉంటాయని తెలిపారు. యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరికుంటపాడు: వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికలకు ప్రధానోపాధ్యాయుడు వీరభద్రయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. ఓటరు జాబితాను నోటీసు బోర్డులో పొందుపరిచారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8న ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దుత్తలూరు: మండలంలోని 51 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. అందుకు సంబంధించిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించారు. ఈ నెల 8న ఎస్‌ఎంసీ కమిటీలను ఎన్నుకోనున్నారు.

సీతారామపురం: మండలంలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంఎసీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌వలి తెలిపారు. తరగతుల వారీగా ఓటర్ల జాబితాను పాఠశాలల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. 5వ తేదీ మధ్యాహ్నం వరకు అభ్యంతరాలను స్వీకరించి తుదిజాబితాను ప్రకటిస్తామన్నారు. 8న ఎస్‌ఎంసీ కమిటీల ఎన్నిక, ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు వివరించారు. ఎన్నికలను నిష్పాక్షికంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు



చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

జలదంకి: మండలంలోని చినక్రాక మిట్టపాళెంలో విద్యుత్ వైర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. విద్యుత్ వైర్లు కిందకు జారిపోయి చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు సైతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. జలదంకి విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరురూరల్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నెల్లూరులోని పురమందిరంలో ఈ నెల 10న నిర్వహిస్తున్న విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని కరటంపాడు, మహిమలూరు, అప్పారావుపాళెం, బట్టేపాడు, మురగళ్ల, తదితర గ్రామాల్లో ఏపీటీఎఫ్ నాయకులు గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులకు జిల్లా మహాసభల ఆహ్వానపత్రికలను అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, జిల్లా ఎన్నికల కమిటీ సభ్యులు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సాజిద్, వెంగయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



తల్లిపాల వారోత్సవాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

చేజర్ల: సీజనల్ వ్యాధులపై వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. మండలంలోని చిత్తలూరు పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని గదులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణకు కృషి చేయాలన్నారు. కాగా తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చేజర్లలో వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మెహతాబ్, సీహెచ్‌ఓలు మంజుల, చంద్రయ్య, విమలకుమారి, హెప్సీబా, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృత తుల్యం



సీతారామపురం: సంజీవరెడ్డినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



కలిగిరిలో..



దుత్తలూరు మండలం సోమలరేగడలో..



వరికుంటపాడు పీహెచ్‌సీలో పోస్టర్ల ఆవిష్కరణ



అల్లూరు మండలం నార్తుమోపూరులో ...



కావలిలో బాలింతలకు సిరప్‌లు, పౌష్టికాహారం పంపిణీ

కావలి : తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని పేర్కొన్నారు. కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో పట్టణంలోని సంకులవారి తోటలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల బాలింతల్లో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. రొమ్ము, అండాశయ కేన్సర్ వంటివి దరిచేరవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, అంగనవాడీలు రాజ్యలక్ష్మి, రుక్మిణి, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నార్త్ మోపూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు మేరీ, నీరజ, మంజుల, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని ఆయేషా తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్, వైద్యఆరోగ్య సిబ్బంది తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.అనంతరం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక ముస్లిం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పడితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డకు పాలిచ్చే తల్లులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

దుత్తలూరు: సోమలరేగడ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌కే బీబీజాన్ తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామొహిద్దీన్, ఏఎన్‌ఎం చంద్రవతి, హెల్త్ అసిస్టెంట్ అరఫత్‌అలీ, అంగన్‌వాడీలు లక్ష్మమ్మ, మహిళా పోలీసు షబనా, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు మహాలక్ష్మి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.